

రేపు బీజేపీ ఆధ్వర్యంలో రైతు దీక్ష

భగత్‌నగర్, మార్చి 31: రైతుల కోసం మంగళవారం జిల్లాకేంద్రంలో రైతు దీక్ష చేపట్టనున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం అన్ని మండల కేంద్రాల్లో వినతి పత్రాలు అందించాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరి కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో రైతులతో కలిసిరాత్రి బస చేయాలని నిర్ణయించామన్నారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యమ సంఘాలన్నీ దీక్షకుమద్ధతు ఇవ్వాలని కోరారు. నియోజక వర్గపరిధిలోని అన్నిమండలాల్లో అధికారులకు వినతి పత్రాలు అందించాలన్నారు.




నీటి విడుదల నిలిపివేసిన తర్వాత కాకతీయ కాలువలో తగ్గిన ప్రవాహం

కాకతీయ కాలువ నుంచి
నీటి విడుదల నిలిపివేత

తిమ్మాపూర్, మార్చి 31: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు రిజర్వాయర్ నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను ఆదివారం అధికారులు నిలిపివేశారు. ముందస్తు ప్రణాళిక, తాగునీరు ఎద్దడి దృష్ట్యా కాకతీయ కాలువ ద్వారా యాసంగి సాగుకు నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ఎండీలో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉందని, మిడ్ మానేరు నుంచి 1.20టిఎంసీ నీరు మాత్రమే వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి అవసరాలకు 6.20 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని, వాటిని వృథా చేయకుండా వాడుకుంటేనే నీటి ఎద్దడిని అదిగమించవచ్చని అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో ఉన్న నీటిని తాగు నీటి అవసరాల కోసం మొదటి ప్రాధాన్యంగా వినియోగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన నీటిని ప్రాజెక్టులో నిల్వ వుంచమని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు.

'వెలిచాల'కే కాంగ్రెస్ టికెట్



- కరీంనగర్ అభ్యర్థి ప్రకటన నేటికి వాయిదా
- 2 నుంచి ఎన్నికల ప్రచారం
- వ్యూహం రూపొందించిన మంత్రి పొన్నం

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

నెలరోజులుగా ఉత్కంఠ రేపుతున్న కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్న అంశానికి సోమవారం తెరపడనున్నది. ఆదివారం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటి సమావేశమై అభ్యర్థిని ప్రకటించేందుకు రంగం సిద్ధం కాగా అనూహ్యంగా సమావేశం సోమవారానికి వాయిదాపడింది. రెడ్డి, వెలమ, బీసీ సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థులలో ఎవరికి అవకాశం కట్టబెట్టాలన్న విషయంలో పలు సర్వేలు, అభిప్రాయ సేకరణ చేస్తూ తర్జనభర్జన పడ్డ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం చివరికి వెలిచాల రాజేందర్‌రావుకే అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంత్రి పొన్నం ప్రభాకర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు నియోజకవర్గ ఇంచార్జిలు వెలిచాల రాజేందర్‌రావుకే టికెట్ ఇవ్వాలని కోరుతూ ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన తర్వాత తీన్మార్ మల్లన్న పేరు తెరపైకి వచ్చి జోరుగా చర్చ సాగినా చివరకు మంత్రి పొన్నం ప్రతిపాదన వైపే కాంగ్రెస్ పెద్దలు మొగ్గు చూపారని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సహ ఇన్‌చార్జి రోహిత్ చౌదరి కూడా వెలిచాల రాజేందర్‌రావు అభ్యర్థిత్వానికే ఓకే చెప్పినట్లు సమాచారం. దీంతో రాష్ట్రంలో వెలమ సామాజికవర్గానికి కూడా ఒక స్థానం కేటాయించినట్లు అయింది.

● ప్రచారానికి ఏర్పాట్లు

శనివారమే మంత్రి పొన్నం ప్రభాకర్ వెలిచాల రాజేందర్‌రావును పిలుచుకొని అభ్యర్థిత్వం ఖరారు విషయం తెలిపి వెనువెంటనే ప్రచార కార్యాచరణలోకి దూకాలని సూచించడంతోపాటు ఏయే అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏయే రోజు ప్రచారం నిర్వహించాలో సూచించినట్లు సమాచారం. రాజేందర్‌రావుతోపాటు తాను కూడా ప్రచారంలో పాల్గొంటానని చెప్పారని తెలిసింది. అనూహ్యంగా అభ్యర్థి ప్రకటన ఒకరోజు వాయిదాపడడంతో ఏప్రిల్ 2 నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం ప్రారంభిస్తారని సమాచారం. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పొన్నం ప్రభాకర్ చేసిన ప్రతిపాదన వేంరకం వెలిచాలకు టికెట్ ఖరారు చేసిన నాయకత్వం ఆయనను గెలిపించుకొని వచ్చే బాధ్యతను కూడా పొన్నంకే అప్పగించారని చెబుతున్నారు. ఆయన తండ్రి వెలిచాల జగపతిరావు కరీంనగర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది క్రియాశీలపాత్ర. రాజేందర్‌రావు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే అయినా ఆయన 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి పోటీచేశారు. ఆ తర్వాత ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ పార్టీలో చేరారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌కు దూరమై మళ్లీ కాంగ్రెస్‌లో చేరి ప్రస్తుతం టికెట్ తెచ్చుకుంటున్నారు.

5న జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ రాక

- కరీంనగర్, రామడుగు, గంగాధర మండలాల్లో పంట పొలాల పరిశీలన



గంగులతో సమావేశమైన పార్టీ నాయకులు

కరీంనగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ నెల 5న ఉమ్మడి జిల్లాలో పర్యటించ నున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5న ఉదయం హైదరాబాద్ నుంచి ఆయన రోడ్డు మార్గంలో కరీంనగర్‌కు చేరుకుంటారని తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్, రామడుగు, గంగాధర మండలాల్లో స్థానిక నేతలతో కలిసి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తారన్నారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్లకు చేరుకుని రైతులు, నేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడే మీడియా సమావేశంలో మాట్లాడతారని ఆయన తెలిపారు.

గాయత్రి పంప్ హౌస్ నుంచి
వరద కాలువకు నీటి విడుదల



గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు, మార్చి 31: ఎండిపోతున్న పంటలను కాపాడడానికి గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువకు అధికారులు ఆదివారం నీటిని విడుదల చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గాయత్రి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల చేయాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి అధికారులతో ఆదివారం సాయంత్రం ఒక పంపు ద్వారా నీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అన్నదాతలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం పదివేల నష్టపరిహారం ప్రకటిస్తే ఏ ఒక్క రైతుకు నష్టపరిహారం అందించని దద్దమ్మ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అని విమర్శించారు. నీటి విడుదలకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పోకిరీలకు చెక్

- బస్టాండ్, విద్యాసంస్థల వద్ద షీటీం పోలీసుల నిఘా
- ఏడాదిలో 201 ఫిర్యాదులు, 10 ఎఫ్ఐఆర్‌ల నమోదు
- 225 అవగాహన సదస్సులు, 100 మందిపై ఈ-పెట్టీ కేసులు
- 38 మంది పోకిరీలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, మార్చి 31: బహిరంగ స్థలాల్లో మహిళలపై జరిగే లైంగిక హింసను అరికట్టడంతోపాటు పోకిరీల వేధింపులు అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీటీంలు ఏర్పాటు చేశారు. ఒంటరిగా ఉన్న సందర్భంలో మహిళలను ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తుండడంతో బస్టాండ్, విద్యాసంస్థల వద్ద, కూడళ్ళు, మార్కెట్ ఏరియా తదితర ప్రాంతాల్లో షీటీం పోలీసులు మఫ్టీలో నిఘా పెడుతూ నిందితులను రెడ్‌హాండెడ్‌గా పట్టుకు ంటున్నారు.

● బాధితలకు భరోసా...

బాధితులు పోలీసులను సంప్రదించడానికి సులభతర మార్గాలు ఏర్పాటు చేయడంతో సంబంధిత అధికారులు సకాలంలో స్పందిస్తున్నారు. ప్రమాదంలో ఉన్న మహిళలు డయల్ 100, 8712670759 వాట్సప్ నంబరుకు, హాక్ ఐ యాప్, జీ మెయిల్, ట్విట్టర్ ద్వారా పోలీసులను సంప్రదిస్తున్నారు. ఫిర్యాదులు అందుకున్న తక్షణమే పోలీసులు పనిని మొదలుపెడుతున్నారు. వాహనాల వినియోగంలో కూడా పోలీసులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జనసమ్మర్థం ఉన్న ప్రదేశాల్లో కలిసిపోయి పోకిరి పనులు చేసే వారిని కట్టడి చేస్తున్నారు. చట్టపరమైన శిక్షలు పడడానికి అవసరమైన సాక్ష్యాలు సేకరిస్తున్నారు.


● మహిళా చైతన్యంతో పెరుగుతున్న ఫిర్యాదులు...

మహిళల్లో చైతన్యం నింపేందుకు పాఠశాలలు, కళాశాలలతోపాటు మార్కెట్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్నారు. బాధితుల పేర్లు, ఇతర వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా కలిపస్తుండడంతో బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా 2023 సంవత్సరంలో 201 ఫిర్యాదులు షీటీంకు అందాయి. 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 100 మందిపై ఈ-పెట్టి కేసులు, 38 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. కమిషనరేట్ వ్యాప్తంగా 225 అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.




మహిళలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి...

- పి శ్రీలత, మహిళా ఠాణా సీఐ, షీటీం ఇన్‌చార్జి



మహిళలు, విద్యార్థినులు, యువతులు ఎదుర్కొంటున్న వేధింపులపై మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. వేధింపులను భరిస్తూ పోతే సమస్య పెద్దగా మారుతుంది. సమస్య ఏదైనా మొదట తల్లిదండ్రులతో చర్చిస్తే పరిష్కరిస్తారు. వేధింపులపై సామాజిక మాధ్యమాల ద్వారా, ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. మఫ్టీలో షీటీం నిఘా ఉంటుంది. బాధితుల పేర్లను గోప్యంగా ఉంచుతాం.



ముగిసిన 90 శాతం వడ్డీ మాఫీ పథకం

- చివరి రోజు కరీంనగర్‌లో రూ. 54 లక్షల పన్ను వసూలు

కరీంనగర్ టౌన్, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 90 శాతం వడ్డీ మాఫీ పథకానికి ప్రజల నుంచి చక్కటి స్పందన లభించింది. జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలలో ప్రజలు వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని బకాయిలను చెల్లించడంతో ఆయా మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది. ఈనెల 31తో వడ్డీ మాఫీ పథకం ముగుస్తుందని విస్తృత ప్రచారం చేయడమే కాకుండా ఆదివారంతోపాటు సెలవు రోజుల్లోనూ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను తీసుకోవడంతో ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు బకాయిలతో కలిపి 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ ఇళ్ళు, దుకాణాలు, వాణిజ్య సంస్థల నుంచి 35.72 కోట్ల ఆస్తిపన్ను ఆదాయం రావలసి ఉండగా ఆదివారం వరకు 31.66 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు కూడా పెద్ద ఎత్తున వసూలయ్యాయి. 4.52 కోట్ల రూపాయల ఆస్తిపన్ను బకాయిలు వసూలైనట్లు బల్దియా అధికారులు తెలిపారు. ఈసారి ఈ పథకం ద్వారా పెద్ద ఎత్తున బకాయిలు వసూలయ్యాయని అధికారులు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 81,648 ప్రైవేట్ నివేశన, వాణిజ్య గృహాలుండగా 63,659 మంది ఆస్తిపన్నులను చెల్లించినట్లు రెవెన్యూ అధికారి ఆంజనేయులు తెలిపారు.

నోరూరిస్తున్న రంజాన్ వంటకాలు

రుమాల్ రోటి



పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు రోజా ముగిసిన అనంతరం బలవర్ధకమైన ఆహారం తీసుకుంటారు. ఇప్పటికే కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో రంజాన్ వంటకాల స్టాళ్లు వెలిశాయి. వీటిలో ప్రత్యేక వంటకమైన హలీమ్, హరీస్ నోరూరిస్తున్నాయి. వినియోగదారుల కోసం నిర్వాహకులు అన్ని రకాల వంటకాలు, స్వీట్లను సిద్ధం చేస్తున్నారు. ముస్లింతోపాటు ముస్లిమేతరులూ ఈ వంటకాల రుచిని ఆస్వాదిస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



నోరూరించే రంజాన్ ప్రత్యేక వంటకాలు




స్పెషల్ రంజానీ బిర్యాని



హలీం





రంజాన్ వంటకాలతో నిర్వాహకులు



హరీస్‌ను తింటున్న నగరవాసులు

ద్విచక్రవాహనం, ఆటో ఢీ: ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 31: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన హోటల్ నిర్వాహకుడు బోడ సురేష్ (40) ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తంగళ్లపల్లి నుంచి సిరిసిల్లకు వస్తుండగా వెనకనుంచి గుర్తు తెలియని ఆటో ఢీకొట్టింది. దీంతో సురేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. 108 వాతిహనంలో సురేష్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అనుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య ఉమ, కుమారుడు శ్రీహర్షిత్ ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గన్నేరువరం, మార్చి 31, మండలంలోని చొక్కారావుపల్లి బిక్కవాగు నుంచి అనుమతులు లేకుండా మండలంలోని జంగపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మండల కేంద్రానికి చెందిన కవ్వంపల్లి చంద్రయ్య ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బోయినపల్లి, మార్చి 31: బోయినపల్లి పెట్రోల్ పంప్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. వివరాల ప్రకారం వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన భారతి (50), సమీపబంధువు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గంగాధర మండలం రంగారావుపల్లిలో జరిగిన శుభాకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. బంక్ సమీపాన ఆటోను ఢీకోట్టి కింద పడిపోయారు. ఈప్రమాదంలో భారతి అక్కడిక్కడే మృతిచెందగా శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, మార్చి 31: ముస్తాబాద్ మండల కేంద్రంలో ఓ మహిళా ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొర్రె లలిత (50) అనే మహిళ అనే మహిళా మానసిక సమస్యలతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. భర్త కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

చందుర్తి మార్చి 31 : చందుర్తి మండలం మల్యాల గ్రామ శివారులోని కోళ్ల ఫారం సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం రుద్రంగి మండలం మానాల చెందిన నాగరాజు అనే యువకుడితో పాటు మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి మానాలకు వెళుతుండగా మల్యాల గ్రామంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసు

గన్నేరువరం, మార్చి 31: మండలంలోని మాదాపూర్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన బీజేపీ నాయకులపై కేసు నమోదు అయింది. గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన బీజేపీ నాయకులు బండి తిరుపతి, కాంతాల రాజిరెడ్డి, మాడుగుల రామకృష్ణా రెడ్డి, గంగాధర శ్రీకాంత్‌పై ఎఫ్ఎస్‌టి టీమ్ ఇంచార్జి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

తల్లిపై కొడుకు హత్యాయత్నం

మంథని, మార్చి 31: మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన తీగల శాంత పై ఆమె చిన్న కొడుకు అయిన హరీష్ మద్యానికి బానిసై ఆదివారం కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం సమయంలో తన తల్లిని డబ్బులు ఇవ్వమని తిట్టి, కొట్టడంతో అంతటితో ఆగకుండా తన తల్లిని చంపాలనే ఉద్దేశ్యంతో ఒక కత్తిని తీసుకొని ఆమె వీపు భాగంలో పొడిచినట్లు తెలిపారు. తన తల్లిపై హత్యాయత్నం చేసిన హరీష్ పై చర్య తీసుకోవాలని కూతురు తీగల మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్నరైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు అద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, మార్చి31: హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లో కుటుంబ కలహాలతో మౌనికరెడ్డి(32) అనే వివాహిత ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ మండలం చర్లబుత్కూరు గ్రామానికి చెందిన కూర రంగారెడ్డి కూతురు మౌనికరెడ్డిని హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన మేడిద రాకేష్‌రెడ్డితో 2016లో వివాహం జరిగింది. మేడిద రాకేష్‌రెడ్డి తండ్రి సమ్మిరెడ్డి తన కూతురి కొడుకు అయిన స్వాగత్‌రెడ్డి పేరు మీద కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయంలో కుటుంబ కలహాలు చోటుచేసుకోగా మౌనికరెడ్డి పుట్టింటికి వెళ్లింది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసి తిరిగి భర్త ఇంటికి పంపించారు. ఆదివారం ఉదయం మౌనిక తన తండ్రికి ఫోన్ చేసి భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని చెప్పగా వెంటనే కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే మౌనికరెడ్డి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి భర్త రాకేష్‌రెడ్డి, మామ సమ్మిరెడ్డి, ఆడపడుచు భర్త సతీష్‌రెడ్డి, ఆడపడుచు కుమారుడు స్వాగత్‌రెడ్డి కారణమని పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సుడా చైర్మన్‌కు వాకర్స్ అసోసియేషన్ సన్మానం



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌యూ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కరీంనగర్ అర్బన్, మార్చి 31: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని శాతవాహన యూనివర్సిటీలోని శాతవాహన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ ధర్మారం వెంకటస్వామి, పెరుక రాజేందర్, మేకల నర్సయ్య, శ్యామ్ ప్రసాద్, పోచయ్య పటేల్, మోహన చారి, కనకాచారి, అంజన్ కుమార్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

ఒడిస్సా లోక్‌సభ పరిశీలకుడిగా మేనేని రోహిత్‌రావు

కరీంనగర్ అర్బన్, మార్చి 31: ఒడిస్సా లోక్‌సభ పరిశీలకుడిగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు నియామకమయ్యారు. ఒడిస్సా రాష్ట్రంలో రాబోతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ జాతీయ కమిటీ పలు లోక్‌సభ నియోజక వర్గాలకు గాను పలువురు కాంగ్రెస్ నాయకులను నియోజకవర్గ పరిశీలకులుగా నియమించింది. ఈ నియామకాలలో కరీంనగర్ నియోజకవర్గ నేత, ఎమ్మెస్సార్ మనువడు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు ఒడిస్సా లోక్‌సభ పరిశీలకులుగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమైన నాయకుడు రోహిత్ రావు రానున్న రోజుల్లో మరిన్ని మంచి మంచి పదవులను పొందాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రోహిత్‌రావు నియామకంపట్ల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, కాంగ్రెస్ కొత్తపల్లి మండల అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, చర్ల పవన్, యూత్ కాంగ్రెస్ నాయకులు పిట్టల సాయి, కలీం, తాడూరి అజయ్, చేవెళ్ల మల్లికార్జున్, సమీర్, వాజిద్, సాదిక్, భూస ప్రశాంత్, రాజ్ కోటి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'సమాజంలో కవుల పాత్ర కీలకం'

కరీంనగర్ కల్చరల్, మార్చి 31: సమాజంలో కవులు, గాయకుల పాత్ర కీలకమని పెద్దపల్లి జిల్లా అదనపు పాలనాధికారి జివి శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం స్థానిక వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ హుజూరాబాద్ ప్రాజెక్టు పర్యవేక్షకురాలు కోరుకంటి కిరణ్మయి రచించిన 'నీ రాక కోసం' పుస్తకాన్ని జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాహితీ రంగాన్ని పరిపుష్టం చేస్తూ కవులు ఎన్నో పుస్తకాలు వెలువరిస్తున్నారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన అంకితం కథల సంకలనాన్ని ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో కవిత్వం రాస్తున్న వారి సంఖ్య తక్కువని, కిరణ్మయి నీ రాక కోసం కవితా సంపుటిని వెలువరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమృత లత జీవన సాఫల్య పురస్కార గ్రహీత దాస్యం సేనాధిపతి, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత మాడిశెట్టి గోపాల్, ప్రముఖ గాయకుడు కాసు మహేందర్‌రాజు, గాజోజు నాగభూషణం, బొమ్మకంటి కిషన్, గంప ఉమాపతి, యోగాచార్యుల సంపత్‌కుమార్, నగునూరి రాజన్న, ఇటిక్యాల రాము, దామరకుంట శంకరయ్య, తడిగొప్పుల కుమారస్వామి, ఐల్నేని కేశవరావు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరుకున్న ఆర్మీ జవాన్ మృతదేహం

● కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ బండి సంజయ్



ఆర్మీ జవాన్ రామకృష్ణ అంతిమ యాత్ర

సైదాపూర్, మార్చి 31: మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి రామకృష్ణ అనే ఆర్మీ జవాన్ భారత సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ శనివారం మృతి చెందగా మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. ఆర్మీ జవాన్లు మృతదేహాన్ని బుజాన ఎత్తుకొని మోశారు. రామకృష్ణ తల్లి తండ్రుల దుఃఖానికి అవధులు లేకుండా పోయాయి. తన కొడుకు తమను పోషిస్తాడు అనే ఆశతో ఉన్న తల్లితండ్రులు కొడుకు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. రామకృష్ణ తల్లితండ్రులు, కుటుంబసభ్యులను ఎంపీ బండి సంజయ్ పరామర్శించారు. రామకృష్ణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు వీరమల్ల రవీందర్‌రెడ్డి, కందుల శ్రీనివాస్‌రెడ్డి, గాజుల రమేష్, తదితరులు ఉన్నారు.

అన్నదాతలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 31: అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం కడుపులో పెట్టుకుని కాపాడుకుంటుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పక్షాల మాటలతో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. గతంలో రైతులు నష్టపరిహారం అడిగితే రాళ్ల వాన పడి నష్టపోయామని చెప్పిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ధర్నా చేసే నైతిక హక్కు లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పదివేల నష్టపరిహారం ప్రకటిస్తే చొప్పదండి రైతులకు పరిహారం ఇప్పించని అసమర్థ నాయకుడు సుంకె రవిశంకర్ అన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేయగా విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించామన్నారు. గాయత్రి పంప్ నుంచి వరద కాలువకు నీరు విడుదల చేయించామని తెలిపారు. చివరి మడి వరకు నీరందించి పంటలను కాపాడుతామన్నారు. ఈ సందర్భంగా నీరు విడుదలకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, బారీనీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డికి చొప్పదండి రైతుల పక్షాన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో ఎంపీ 'బండి' పూజలు



బండి సంజయ్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

మానకొండూర్, మార్చి 31: మండలంలోని ఊటూర్‌లో జరుగుతున్న మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం కోసం మంచినీటి కోసం బోరు, రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, పాఖాల పురుషోత్తంరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు నక్క కొమురయ్య, ఉపాధ్యక్షులు మెత్రి శంకర్, ప్రధాన కార్యదర్శి గంగదేవి శ్రీనివాస్, కోశాధికారి జంగ సంపత్, డైరెక్టర్లు నరేష్, స్వామి, చేరాలు, ఐలయ్య, కొమురయ్య, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



రంగాపూర్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

కరీంనగర్ కల్చరల్, మార్చి 31: జిల్లాలోని చర్చిల్లో ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ జాన్ సందేశమిచ్చారు. టీసాల మోహన్‌రాజ్, బి.ప్రవీణ్ సాగర్, చంద్రశేఖర్, సందీప్, జడ్సన్, విలియం, మహిళలు పాడిన గీతాలు అలరించాయి.

●హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో పాస్టర్ సతీష్‌కుమార్, సొల్లు బాబు, ప్రియాంక-శరణ్, రోహన్, రవి, ఎలియా, డేవిడ్‌రాజ్, ప్రతాప్, సంపత్, సుకన్య, సుశీల, సునీత, సురేఖ, లలిత, సుమాంజలి పాల్గొన్నారు.

●హుజూరాబాద్ రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలోని కల్వరి టెంపుల్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాస్టర్ కొమ్మగల్ల డానియేలు హాజరై దైవసందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం చర్చి పాస్టర్ నెల్సన్‌తో కలిసి కేక్ కట్ చేశారు.

●శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

●గంగాధర: మండలంలో యేసు పునరుద్ధాన దినం ఈస్టర్ పండగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక గీతాలను ఆలపించారు. అనంతరం చర్చిల్లో విందులో క్రైస్తవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ధర్మతేజ, పీటర్, యాది ప్రకాశ్, ధర్మ చైతన్య, యోబు, ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

●చొప్పదండి: చొప్పదండిలోని హోలీ షాలోమ్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ గుండెటి శాంతికుమార్ శాంతి సందేశాన్ని ఇచ్చారు.

ఎస్సీ ఉప కులాల కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించండి

కరీంనగర్ టౌన్, మార్చి 31: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదని, కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించాలని ఉప కులాల హక్కుల పోరాట సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిపాటి వేణు, జిల్లా అధ్యక్షుడు ఔషదం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు తల్వార్ పరమేశ్వర్, చింతల అంజి, తిరుపతి లింగయ్య తదితరులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. ఆదివారం ఈమేరకు కరీంనగర్‌లో సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు డీఏ బకాయిలను ఇవ్వాలని బీజేపీ రిటైర్డు టీచర్స్ ఎంప్లాయిస్ సెల్ కో చైర్మన్లు నరహరి లక్ష్మారెడ్డి, పులి నరోత్తంరెడ్డి, టి.ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి వస్తే డీఏ బకాయిలను 15రోజుల్లోనే చెల్లిస్తామని మాటతప్పి ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరితో విసిగి వేజారి నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించారని అన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

-మానేరు పాఠశాల వార్షికోత్సవంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్, మార్చి 31: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో మానేరు విద్యాసంస్థల 38వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు విద్యాప్రమాణాలు పాటిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 2022-23 సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో పదికి పది జీపీఏ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, గండ్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, బుర్ర మధుసూదన్‌రెడ్డి, కృపాదానం, తుమ్మల రమేశ్‌రెడ్డి, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

వరద కాలువకు నీటిని విడుదల చేయాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, మార్చి 31: వరద కాలువకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల వరద కాలువపై రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వరదకాలువకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతుల పంటపొలాలకు నీరు ఇప్పించని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాజీనామా చేయాలన్నారు. ఒక్క ఎకరం ఎండిపోకుండా నీరందించాలని డిమాండ్ చేశారు. ఎండిన పంటలకు ఎకరాకు 25వేల రూపాయల నష్టపరిహారం అందించాలని అన్నారు. రైతులను కన్నీరు పెట్టిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, మాజీ డైరెక్టర్ గడ్డం స్వామి, డీలర్ బాలగౌడ్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాలకు మేలు

ఇల్లందకుంట, మార్చి 31: కేంద్రంలో మోదీ ప్రభుత్వ పథకాలతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఇల్లందకుంట మండలంలో బీజేపీ మండలాధ్యక్షు డు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో లాబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదలు, యువత, రైతులు, మహిళలు అభివృద్ధి చెందే విధంగా బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి బీజేపీ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులంతా అండగా, మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహరాజు, కళాల సంజీవ్, శీలం శ్రీనివాస్, ఎండీ షఫీ, రాంబాబు, సమ్మయ్య, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, చిరంజీవి, సదయ్య, రా జయ్య, రమేష్, రాములు, దేవేందర్, విజయ్‌రెడ్డి, సిద్దు, మహేష్, మల్లయ్య పాల్గొన్నారు.

బాలుడికి విద్యా ఫౌండేషన్ చేయూత

చొప్పదండి, మార్చి 31: చొప్పదండికి చెందిన ఓ నాలుగేళ్ల బాలుడికి విద్యా ఫౌండేషన్ చేయుతను అందించింది. బీసీ కాలనీకి చెందిన మారంపెల్లి రాజు మరణించగా ఆయన కుమారుడు విశ్వక్‌సేన్ చదువు పూర్తి అయ్యేంతవరకు ఆ ఖర్చును తాము భరిస్తామని ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి తెలిపారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి వారికి ఈ విషయాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సామల వెంకటేశం, కటకం నారాయణ, దాసరి మునీందర్, పైడ మహేశ్, సిరిపురం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఇల్లందకుంట, మార్చి 31: ఇల్లందకుంట, జమ్మికుంట, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తోడేటి శ్రీనివాస్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. మేదరివాడ అడ్డా అధ్యక్షుడిగా రామంచ స్వామి, ఉపాధ్య క్షుడి బందెల సతీష్, ప్రధాన కార్యదర్శిగా జోడు రాజు, వర్కింగ్ ప్రెసి డెంట్‌గా మొక్కపల్లి కుమార్, కార్యద ర్శిగా జంగంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా మాస్ తిరుపతి, సలహాదారుగా గడ్డం రాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా కాపర్తి జితేందర్‌ను ఎన్నుకున్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



మాదాపూర్‌లో బోనాలతో మహిళలు

మానకొండూర్, మార్చి 31 : మానకొండూర్‌లో ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మానకొండూర్, శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, సదాశివపల్లి గ్రామాల్లో పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాలలో మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ళ మధ్య శివసత్తుల పూనకాలతో నృత్యాలు చేస్తూ పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు.

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ప్రజలు ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధిని పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి



దేశపతి శ్రీనివాస్, వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్, మార్చి 31: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అల్గునూర్‌లో ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు అధ్యక్షతన మానకొండూర్ నియోజకవర్గ స్థాయి విద్యార్థి యువజన కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశపతి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ అనవాళ్లు లేకుండా చేస్తానని చెబుతూ రాష్ట్రాభివృద్ధిని అనవాళ్లు లేకుండా చేస్తున్నాడని విమర్శించారు. ఓ వైపు రైతుల పంటలు ఎండుతుంటే వాటిపై దృష్టి సారించకుండా ఎంపీ బండి సంజయ్ మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్‌ను గెలిపించాలని దేశపతి శ్రీనివాస్ కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ మాట్లాడుతూ తనను ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

-ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్



ఎస్ఎఫ్ఐ సభలో పాల్గొన్న నాయకులు

భగత్‌నగర్, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. ఆదివారం నగరంలోని శివాని డిగ్రీ, పీజీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నగర మహాసభ భారత విద్యార్థి ఫెడరేషన్, ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ల మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదలచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక సమస్యలతో విద్యార్థులు కొట్టుమిట్లాడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై శ్రద్ధ లేకుండా వ్యవహరిస్తుందన్నారు. వార్డెన్లు కొన్ని నెలలుగా ఇబ్బందులను ఎదుర్కొంటు విద్యార్థులకు సామాన్లు ఇచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌రాక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సైతం చాలా ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కమిటీని ఎన్నుకున్నారు.

అధ్యక్షులుగా ఎల్కటూరి ఈశాక్, కార్యదర్శిగా అసంపెల్లి వినయ్ సాగర్‌తో పాటు 16 మంది నూతన నగర కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, నాయకులు బోగేశ్, శివమణి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

కరీంనగర్ రూరల్, మార్చి 31: కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నగరంలోని జ్యోతి నగర్‌లో అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలపై కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదింటి యువతుల వివాహాలకు చేయూత

సుభాష్‌నగర్, మార్చి 31: ఆపోపా ఆధ్వర్యంలో పేదింటి యువతుల వివాహాలకు చేయూత అందించారు. ఆదివారం జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ చేపట్టిన కల్యాణలక్ష్మి కార్యక్రమంలో భాగంగా నగరంలోని కార్యాలయంలో కరీంనగర్‌కు చెందిన ఇమ్మడోజు హిమబిందు, తాడురి నందినిల పెళ్లికి లాంచనాలతో పాటు రూ.8,116ల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి, అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, ప్రధానకార్యదర్శి గజ్జెల నరహరాచారి, బాధ్యులు యాస్వాడ అంజయ్య, కట్ట వీరబ్రహ్మం, గాలిపెల్లి శంకరయ్య, యాస్వాడ చంద్రమౌళి, బండ్ల శివప్రసాద్, తిప్పర్తి అంజయ్య, భీష్మాచారి, రవీందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సుభాష్‌నగర్, మార్చి31: జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆపోపా) ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ చలి వేంద్రాన్ని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి గజ్జెల హరిహరచారి, కోశాధికారి యాస్వాడ అంజయ్య, కట్ట వీరబ్రహ్మం, గాలిపెల్లి శంకరయ్య, యాస్వాడ చంద్రమౌళి, బండ్ల శివప్రసాద్, తిప్పర్తి అంజయ్య, ఎర్రోజు భీష్మాచారి, బెజ్జంకి రవీందర్, చంద్ర మోహన్‌రావు, కట్ట రామకృష్ణ, దేవరకొండ ముత్యం పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 31: బీహార్‌లోని బౌరనిలో ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కరీంనగర్ జట్టు తరఫున ఎ.సాయికృష్ణ, జె.రాజు, టి.జితేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మన్ తెలిపారు. గత ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్‌లో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 52వ తెలంగాణ రాష్ట్రస్థాయి మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించగా అద్భుత ప్రతిభ కనబరిచిన ఈ ముగ్గురిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరి ఎంపికపై డీవైఎస్‌వో శ్రీకాంత్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్, ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, ఉమ్మడి జిల్లా హాండ్ బాల్ సంఘం బాధ్యులు సురేందర్, కృష్ణహరి, శ్రీనివాస్, ప్రేమ్ విద్యాసాగర్ తదితరులు హర్షం వ్యక్త ంచేశారు.

ఇంటర్ అడ్మిషన్లపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి

కరీంనగర్ టౌన్, మార్చి 31: ఉమ్మడి జిల్లాలో జూనియర్ కళాశాలలు చేస్తున్న అడ్మిషన్ల దందాపై ప్రభుత్వం దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై వెంటనే చర్యలు చేపట్టాలని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అజయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూతన విద్యా సంవత్సరానికి మరో రెండున్నర నెలల సమయం ఉన్నప్పటికీ పేరొందిన కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఇప్పటికే 90శాతం పైగా అడ్మిషన్లు పూర్తి చేశాయని ఆరోపించారు. అక్రమంగా అడ్మిషన్ ఫీజులను వసూలు చేస్తున్న కళాశాలలపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వత్తాసు పలకడం శోచనీయమని అన్నారు. ఒకే బ్రాండ్ పేరు మీద వందలాది కళాశాలలు పెట్టి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేద్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

చొప్పదండి, మార్చి 31: ఆల్ ఇండియా అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కడారి గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా కల్లెపెల్లి అరవింద్‌ను ఎన్నుకున్నారు. గొల్లపెల్లి మోహన్ సమక్షంలో ఎన్నికలు జరగగా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్ గ్రామ అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఆదివారం ఏర్పాటు అయింది. అధ్యక్షుడిగా ఇస్కుల్ల ఆంజయ్య, ప్రధాన కార్యదర్శి కోండ్ర సురేష్, ఉపాధ్యక్షులుగా పోగుల మహేందర్, గంజి శ్రీనివాస్, కార్యదర్శిగా ఆరెపల్లి సుమన్ ఎన్నికయ్యారు. పల్లం సంతోష్, రామగిరి రాజు, ఎర్రల కవిత, కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

హుజూరాబాద్, మార్చి 31: నీళ్లు లేక ఎండిపోయిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎకరానికి రూ. 30వేల నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి పంటలకు నీళ్లు అందక పంటలు ఎండిపోయి, రైతులు అప్పుల పాలయ్యారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం ఇచ్చిన వాగ్దాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో వి రాజిరెడ్డి, అశోక్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

హుజూరాబాద్, మార్చి 31: జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి బీజేపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సింగరాల రామరాజు అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. దేశంలోని ప్రజలు మోదీ వైపు చూస్తున్నారన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మరోసారి గెలవడం ఖాయమన్నారు.

తపాల ఉద్యోగికి సన్మానం

హుజూరాబాద్, మార్చి 31: హుజూరాబాద్ పట్టణంలోని తపాల కార్యాలయంలో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వర్తించిన ముంజాల సంపత్ పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌ను తోటి తపాల ఉద్యోగులు శాలువాలు, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో ఊకంటి మహేందర్, రవికుమార్, రజినీకాంత్, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, చంద్రమోహన్, హరీష్, శివాజీ, సతీష్, సత్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మానకొండూర్, మార్చి 31: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని సైకాలజిస్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. మండలంలోని శ్రీనివాస్ నగర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే లక్ష్యాలను ముందే ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా చదివి ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.